
సదాశివనగర్ మండలం తిర్మన్‌పల్లి గ్రామసభలో అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు


ఉప్లూర్‌లో అనర్హులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరుపై అధికారులను ప్రశ్నిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

## కామారెడ్డి జిల్లాలో..

కామారెడ్డి జిల్లాలోనూ గందరగోళ పరిస్థితి నెలకొన్నది. బిచ్కుంద మండలం గోపాన్‌పల్లిలో రేషన్‌కార్డులు ఇవ్వాలని గ్రామస్తులు ధర్నా చేశారు. బీబీపేట మండలం తుజాల్‌పూర్, మల్కాపూర్, ఇస్సానగర్‌లో నిర్వహించిన గ్రామసభల్లో స్థానికులు అధికారులను నిలదీశారు. తుజాల్‌పూర్‌లో అర్హులు కాకుండా ఇతరుల పేర్లు జాబితాలో రావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్సై ప్రభాకర్ వచ్చి స్థానికులను సముదాయించారు. దోమకొండ మండలం అంచనూర్, చింతమాన్‌పల్లి, గొట్టిముక్కులలోనూ అధికారులను నిలదీశారు. తాతల కాలం నుంచి సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలివ్వాలని నాగిరెడ్డిపేట గ్రామసభలో రైతులు పట్టుబట్టారు. ఎల్లారెడ్డి మండలం రుద్రారంలో అనర్హులకు పథకాలు కేటాయించారంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్హులను కాకుండా కాంగ్రెస్ నేతలు చెప్పిన వారి పేర్లనే జాబితాలో చేర్చారని నిలదీశారు. గందరగోళం నెలకొనడంతో గ్రామసభ వాయిదా పడింది. సదాశివనగర్ మండలం తిర్మన్‌పల్లిలో ఉద్రిక్తత నెలకొంది. జాబితాలో తమ పేర్లు లేవని స్థానికులు ఆందోళనకు దిగారు. అడిషనల్ కలెక్టర్ విక్టర్ వచ్చి వారికి సర్దిచెప్పారు. నస్రుల్లాబాద్, బీర్కూర్ మండలాల్లోనూ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, ఆత్మీయభరోసా లబ్ధిదారుల ఎంపికలో అర్హుల పేర్లు గల్లంతయ్యాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బీర్కూర్ మండలం భైరాపూర్, గాంధారి ఒమడలం మాతు సంగెం, పర్మళ్ల తండా, చద్మల్, లింగంపేట మండలం శెట్పల్లి, శెట్పల్లి సంగారెడ్డి, అయ్యపల్లి, అయ్యపల్లి తండా, ఎక్కపల్లి, మాలపాటి, మాలోత్ సంగ్యానాయక్ తండా, మాలోత్ తండా, సజ్జన్‌పల్లిలో గ్రామస్తులు నిరసన తెలిపారు. శెట్పల్లిలో ఆత్మీయ భరోసాకు 44 మందిని ఎంపిక చేయగా, గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో నలుగురిని మాత్రమే ఫైనల్ చేశారు. పర్మళ్ల, శెట్పల్లిసంగారెడ్డి తదితర గ్రామాల్లో రేషన్ కార్డుల జాబితాలో పేర్లు రాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పెద్దకొడప్‌గల్ మండలం బుర్గుపల్లి, చిన్నదేవిసింగ్‌తండా, పోచారం, చిక్కడ్‌పల్లి తదితర గ్రామాల్లోనూ నిరసనలు వ్యక్తమయ్యాయి.


బడాభీమ్‌గల్‌లో అధికారులను ప్రశ్నిస్తున్న గ్రామస్తులు

## నిజామాబాద్ జిల్లాలో

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో బుధవారం నిర్వహించిన గ్రామసభలు నిలదీతలు, నిరసనలతో రసాభాసగా మారాయి. పథకాలకు అర్హులను కాకుండా అనర్హులను ఎంపిక చేయడంపై ప్రజలు అధికారులను నిలదీశారు. నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి, మోర్తాడ్ మండలాల్లో బుధవారం జరిగిన గ్రామసభలు ప్రజల నిలదీతలతో తీర్మానాలు చేయకుండానే ముగించారు. కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్‌లో మహిళలు ఇందిరమ్మ ఇండ్ల గురించి నిలదీశారు. భూములు, బంగ్లాలు ఉన్నోళ్లకే ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్నారని, ఎన్నోసార్లు దరఖాస్తులు చేసుకున్నా తమనెందుకు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు, ఇండ్ల కేటాయింపులపై అంగన్‌వాడీ టీచర్లు సైతం నిలదీయడం గమనార్హం. మోర్తాడ్ మండలం వడ్యాట్‌లోనూ కార్డులు, ఇండ్ల విషయంలో అధికారులను ప్రశ్నించారు. కాంగ్రెస్‌కు చెందిన వారి పేర్లే జాబితాల్లో ఉండడంపై అసహనం వ్యక్తంచేశారు. మళ్లీ దరఖాస్తులు చేసుకోవాలని వారు బదులివ్వడంతో ఆగ్రహించిన ప్రజలు ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకోవాలని నిలదీయడంతో ఎలాంటి తీర్మానాలు చేయకుండానే గ్రామసభను ముగించారు. భీమ్‌గల్ మండలం బాచన్‌పల్లిలో ఓ రైతు తనకు రైతు రుణమాఫీ కాలేదని, ముందు దాని సంగతి చూడాలని పట్టుబట్టాడు. దీంతో కొద్దిసేపు గందరగోళం నెలకొన్నది. బడాభీమ్‌గల్‌లోనూ ఇలాగే కొనసాగింది. కేసీఆర్ ప్రభుత్వం 120 ఇండ్లు కట్టించి లబ్ధిదారులకు అందజేసిందని, అయినా గ్రామంలో ఇంకా 400 దరఖాస్తులు వచ్చాయంటే సర్వే ఎలా చేశారని మండిపడ్డారు. ఏడాదిలోనే ఇంత మందికి ఇండ్లు లేకుండా పోయాయా? అని నిలదీశారు. బాల్కొండ మండలం కిసాన్‌నగర్‌లో రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్లను కాంగ్రెస్ పార్టీకి చెందిన వారికి, భూములు ఉన్న వారికి కేటాయించారని జనం ఆగ్రహం వ్యక్తం చేశారు.


నస్రుల్లాబాద్‌లో అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు

# ఊరూరా రసభస

పల్లెపల్లెనా పద'నస'లు

- అడుగడుగునా నిలదీతలు
- గ్రామసభల్లో గందరగోళం
- జాబితాల్లో అర్హుల పేర్లు గల్లంతు
- అన్నింట్లోనూ అనర్హులకు పెద్దపీట
- గొంతెత్తిన పేదలు..
- కంగారుపడ్డ అధికారులు
- రేషన్‌కార్డులు, ఇండ్లపై నిలదీసిన జనం

**సర్కారు చేసిన మోసంపై** ఊరు గొంతెత్తింది.. పథకాల ఎగవేతపై పల్లె ఎలుగెత్తి నిలదీసింది. లబ్ధిదారుల ఎంపికలో పేదవారికి జరిగిన అన్యాయంపై ఆక్రోశం వెల్లువెత్తింది. రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, ఆత్మీయ భరోసా దక్కక గుండె మండిన సామాన్యులు తిరగబడ్డారు. అర్హులను కాదని అనర్హులను జాబితాలో చేర్చడంపై ఎక్కడికక్కడ అధికారులను నిలదీశారు. ధర్నాలు, నిరసనలు, నిలదీతలతో హోరెత్తించారు. ఉమ్మడి జిల్లాలో బుధవారం నిర్వహించిన గ్రామసభల్లో కనిపించిన దృశ్యాలివి.. సర్కారుపై వెల్లువెత్తుతున్న వ్యతిరేకతకు నిలువెత్తు నిదర్శనాలివి..

–నమస్తే యంత్రాంగం, జనవరి22


బోధన్ మండలం బెల్లాల్ గ్రామసభలో అధికారులతో గ్రామస్తుల వాగ్వాదం

## మండలాల్లో ఇలా..

బోధన్ మండలం బెల్లాల్‌లో నిర్వహించిన గ్రామసభ గందరగోళంగా మారింది. ఇక్కడ పుట్టి పెరిగిన తమ పేర్లు జాబితాలో రాలేదని, బయటి నుంచి బతకడానికి వచ్చిన వారికి మాత్రం ఎలా వచ్చాయని ప్రశ్నించారు. నవీపేట మండలం మహంతంలో గ్రామసభకు హాజరైన ఆర్డీవో రాజేందర్‌కుమార్‌ను గ్రామస్తులు నిలదీశారు. పూటకు తిండిలేని కుటుంబాలెన్నో ఉన్నా వాళ్లను కాదని, అనర్హులను ఎలా ఎంపిక చేస్తారని మండిపడ్డారు. ఇందిరమ్మ ఇండ్లు, ఆత్మీయ భరోసా జాబితాల్లో పేర్లు లేవని మోకాన్‌పల్లి గ్రామస్తులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కోటగిరిలో నిర్వహించిన గ్రామసభలో ఆత్మీయభరోసా, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల జాబితాల్లో అర్హుల పేర్లు గల్లంతు కావడంపై జనం అధికారులను నిలదీశారు. పరిస్థితి తీవ్రమవుతుండడంతో పోలీసులు జోక్యం చేసుకుని సర్దిచెప్పారు. రుద్రూర్ మండలం సులేమాన్‌నగర్‌లో స్థానికుల ఆందోళనతో గ్రామసభ మూడు గంటలకు పైగా నిలిచి పోయింది. పుట్టిన నాటి నుంచి గ్రామంలో ఉన్న వారికి కాకుండా వలస వచ్చిన వారికి రేషన్ కార్డులు ఇవ్వడమేమిటని నిలదీశారు. 96 మంది పేర్లు వస్తే అందులో 76 మంది వలస వచ్చిన వారేనని తెలిపారు. ఆత్మీయభరోసా జాబితాలో లబ్ధిదారుల ఇంటి పేర్లు, భర్తల పేర్లు లేకపోవడంతో జనం అయోమయానికి గురయ్యారు. అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ గ్రామసభను అడ్డుకున్నారు. దీంతో ఏసీపీ శ్రీనివాస్ వచ్చి గ్రామస్తులకు సర్దిచెప్పారు. డిచ్‌పల్లి మండలం ఖిల్లా డిచ్‌పల్లి, డిచ్‌పల్లి తండా, సుద్దపల్లి, దేవుపల్లి క్యాంప్, మెంట్రాజ్‌పల్లి, నాకాతండా, యానంపల్లి, యానంపల్లి తండాల్లోనూ రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల జాబితాలపై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు, అనర్హుల పేర్లు వచ్చాయని, అర్హులైన పేదలకు మొండిచేయి చూపారని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిజామాబాద్ మండలంలోని కొత్తపేట్, రామ్‌నగర్ గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభలో గందరగోళం జరిగింది. భూమి ఉన్న వారి పేర్లు ఆత్మీయ భరోసా కింద ఎలా వచ్చాయని అధికారులను నిలదీశారు.


డిచ్‌పల్లి మండలం సుద్దపల్లి గ్రామసభలో అధికారులను చుట్టుముట్టిన గ్రామస్తులు


ఉప్లూర్ గ్రామసభలో నిలదీస్తున్న వ్యక్తిని వారిస్తున్న ఎస్సై


నవీపేట మండలం మహంతం గ్రామ సభలో ఇందిరమ్మ ఆత్మీయ భరోసాపై అధికారుల నిలదీత


కోటగిరి గ్రామసభలో అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేస్తున్న మహిళలు

### అనర్హులకే ఇందిరమ్మ ఇండ్లు



బాల్కొండ, జనవరి 22 : కిసాన్‌నగర్ గ్రామంలో బుధవారం నిర్వహించిన గ్రామసభలో గందరగోళం చోటుచేసుకున్నది. ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో అర్హులైన పేదలకు కాకుండా అనర్హుల పేర్లు వచ్చాయి. కనీసం భూమిని సేకరించకుండానే ఇండ్లు ఇస్తున్నామంటూ ఆశ చూపిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామసభల పేరిట ప్రజలను మళ్లీ మభ్యపెట్టాలని చూస్తున్నది.

### అర్హుల పేర్లను తొలగిస్తున్నరు..



లబ్ధిదారుల ఎంపిక సరిగ్గాలేదు. గ్రామ పంచాయతీ సిబ్బంది చేసిన సర్వేను లెక్కలోకి తీసుకుంటలేరు. కొంత మంది అధికార పార్టీ నాయకులు పథకాల జాబితా నుంచి లబ్ధిదారుల పేర్లను తొలగించారు. వారు సూచించిన వారికే పథకాలు ఇస్తారని మాకు తెలుస్తున్నది.

-శరత్, కిసాన్‌నగర్

## 'ఫీజు రీయింబర్స్‌మెంట్' ఇవ్వాలి

- ఇవ్వకపోతే కాలేజీలను నిరవధికంగా బంద్‌చేస్తాం..
- టీయూ వీసీకి ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాల వినతి


వీసీకి వినతి పత్రం ఇస్తున్న ప్రైవేట్ డిగ్రీ కళాశాలల అసోసియేషన్ ప్రతినిధులు

డిచ్‌పల్లి, జనవరి 22 : మూడేండ్లుగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని కోరుతూ ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు బుధవారం తెలంగాణ యూనివర్సిటీ వీసీ యాదగిరిరావుకు వినతిపత్రం అందజేశాయి. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల కానీ పక్షంలో కాలేజీలను నిరవధికంగా బంద్ చేస్తామని పేర్కొన్నాయి. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు హరిప్రసాద్, సంజీవ్ మాట్లాడుతూ.. తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాలు ఎంతో మంది విద్యార్థులకు ఉచితంగా చదువు చెప్పినా, తమకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకుండా ప్రభుత్వం జాప్యం చేయడం సరికాదన్నారు. ఏడాది నుంచి సిబ్బంది జీతభత్యాలు, భవనాల అద్దె కూడా చెల్లించడంలేదన్నారు. వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రైవేట్ డిగ్రీ కళాశాలల మేనేజ్ మెంట్ అసోసియేషన్ ప్రతినిధులు మారయ్యగౌడ్, శంకర్, నరాల సుధాకర్, జైపాల్ రెడ్డి, బాలాజీ, గిరి, శ్రీనివాస్, సుజన్ రెడ్డి, మలేహ, దుష్యంత్, రమణ, శ్రీనివాస్ రెడ్డి, శివాజీ, నవీన్, హరికృష్ణ, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.


## వద్దని చెప్పినా ఇల్లు మంజూరు చేశారు..

- జాబితాలో పేరువస్తే ఇది ఎవరి లోపమో గుర్తించాలి
- బీఆర్ఎస్ మాజీ కార్పొరేటర్ విశాలిని రెడ్డి

ఖలీల్‌వాడి, జనవరి 22: తనకు ఇందిరమ్మ ఇల్లు వద్దని చెప్పినా, మంజూరైనట్లు జాబితాలో పేరువస్తే ఇది ఎవరి లోపమని బీఆర్ఎస్ మాజీ కార్పొరేటర్ చామకూర విశాలినిరెడ్డి అధికారులను ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక తెలంగాణ ఉద్యమకారులు ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోవాలని సూచించినట్లు తెలిపారు. ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, పింఛన్ ఇస్తామని ప్రకటించిందని గుర్తుచేశారు. తాను తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నానని, తనపై పోలీసులు కేసులు నమోదుచేశారని తెలిపారు. తెలంగాణ ఉద్యమకారిణిగా ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నా, ఇంటింటి సర్వేలో మాత్రం తనకు ఇందిరమ్మ ఇల్లు వద్దని చెప్పానని తెలిపారు. అయినా ఇల్లు మంజూరైతే ఇది ఎవరి తప్పని ఆమె ప్రశ్నించారు.

# పేరుకే గ్రామసభలు

- అప్లికేషన్ల పేరిట ముప్పుతిప్పలు పెడుతున్న ప్రభుత్వం
- మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

భీమ్‌గల్, జనవరి 22: ప్రజాపాలన గ్రామ సభలు పేరుకే నిర్వహిస్తున్నారని, కాంగ్రెస్ కార్యకర్తలు చెప్పిన వారికే ఇండ్లు, రేషన్ కార్డులు వస్తాయని ఆ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులే అంటున్నారని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. అన్ని కాంగ్రెస్ కార్యకర్తలు చెప్పిన వారికే ఇస్తే ఇక గ్రామసభలు, అధికారుల సర్వే ఎందుకని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాపాలన గ్రామసభలన్నీ బోగస్ సభలని విమర్శించారు. బుధవారం ఆయన వేల్పూర్‌లోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి ప్రజాపాలన, గ్రామసభల పేరిట ప్రజలను మోసం చేస్తున్నదని మండిపడ్డారు. హామీలు అమలుచేయాలని అడిగితే అప్లికేషన్ల పేరిట ప్రజలను జిరాక్స్ సెంటర్లు, మీ సేవ కేంద్రాలు, మండల పరిషత్ కార్యాలయాల చుట్టూ ఏడాదికాలంగా తిప్పుకుంటున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు ఒక్కహామీ కూడా సక్రమంగా నెరవేర్చడంలేదన్నారు. మొదటిసారి మండల పరిషత్ కార్యాలయం, రెండోసారి ప్రజాపాలన అంటూ దరఖాస్తులు తీసుకున్నారని, ముచ్చటగా మూడోసారి ఇంటింటి సర్వేలో వివరాలు తీసుకున్నారని తెలిపారు. ఏడాది తర్వాత ఇప్పుడు నాల్గోసారి గ్రామసభలో దరఖాస్తులు ఇవ్వాలంటూ చెబుతున్నాడని మండిపడ్డారు. ఏడాది పొడవునా ఇచ్చిన దరఖాస్తులు ఎటుపోయాయని, ఎక్కడ పడేశారంటూ ప్రశ్నించారు. స్థానిక సంస్థల ఎన్నికలు రానుండడంతో ప్రజలను మరోసారి మభ్యపెట్టడానికే ఈ గ్రామసభల డ్రామా అంటూ దుయ్యబట్టారు.

### లబ్ధిదారులు గ్రామసభల్లో నిలదీయండి

పథకాల జాబితాలో అర్హుల పేర్లు ఉండేలా లబ్ధిదారులు గ్రామసభల్లో పట్టుబట్టాలని, అప్పుడే న్యాయం జరుగుతుందని వేముల పేర్కొన్నారు. అనేక గ్రామాల్లో లబ్ధిదారులు వారి పేర్లు జాబితాలో లేకపోవడంతో అధికారులను నిలదీస్తున్నారని అన్నారు. అర్హులకు అండగా బీఆర్ఎస్ కార్యకర్తలు ఉంటారని భరోసా ఇచ్చారు.

### దమ్ముంటే రైతులకు రుణమాఫీ చేయించు..

కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి సునీల్ కుమార్ సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి నియోజకవర్గంలోని 31వేల మంది రైతులకు రుణమాఫీ చేయించాలని వేముల సవాల్ విసిరారు. ఎగ్గొట్టిన రైతుబంధు, మహిళలకు రూ.2,500, తులం బంగారం ఇప్పిస్తే ఆయన సిపాయి అవుతారని, కానీ తన మీద ఏడిస్తే కావన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు